# స్వాతంత్ర్యం ఖరీదు

(గల్పిక)

"శ్రీపతి" — కలంపేరు — తన భార్యతో అన్నాడు: "లక్ష్మి, స్త్రీల విమోచనం గురించి వరసగా వ్యాసాలు రాద్దామనుకుంటున్నాను. వాటిని నీ పేర పంపించి, పత్రికలో అచ్చేయిస్తాను, ఏం ?"

"మీ పేరే పంపరాదూ ?"

"ఇంకా నయం. ఇప్పటికే నా కలంపేరు మా ఆఫీసులో కొందరికి తెలిసిపోయింది. మా బాస్‌కు తెలిస్తే ఉద్యోగం ఊడుతుంది."

"ఇంకో కలంపేరు పెట్టుకోండి."

''మగపేరుతో రాస్తే ఆడాళ్ళపత్రిక అచ్చెయ్యదు."

"ఆడపేరు పెట్టుకోండి.''

అందుకేగదా నీ పేరు పెడతానంటున్నాను."

"నా పేరుతప్ప ఇంకో ఆడపేరే దొరకలేదా ?" నా పేరు నేను అరువియ్యను."

"అది కాదే, వెర్రిమొహమా ! ఎవరన్నా ఇంటర్‌వ్యూ చేస్తామని వస్తే? ఉత్తరాలు రాస్తే ?"

"అదా సంగతి ? మీ దారిన మీరు ఏదో గాలికి పారేస్తే ఆ తరవాత తిట్లూ, దీవనలూ నేను భరించాలా ? ఎంతమాత్రం వీల్లేదు !''

"నీ వరస ఏమీ బాగాలేదు. నేనైనా మీ ఆడవాళ్ళ ఉద్ధరింపులేగదా చెబుతున్నాను ? ఆడవాళ్ళ స్వేచ్ఛకోసం లోకమంతా ఘోషిస్తూంటే నువు కాస్త సహకరించనంటావే ! ఆడదానివికాదూ? సిగ్గులేదూ ?"

"ఆ మాట అన్నారు గనక నా స్వాతంత్ర్యాన్ని అమ్ముకుంటాను. దానికి ఏమిస్తారు ? అయిదు తులాల బంగారం నగలూ, మూడు పట్టుచీరలూ ఇస్తారా ? టి.వి. సెట్టు కొంటారా ?''

"ఏమాశ్చర్యం ! నీ స్వాతంత్ర్యాన్ని అమ్ముకుంటావా ?''

''జీతం డబ్బులకు మీ స్వాతంత్ర్యాన్ని అమ్ముకున్నట్టు మీరు ఎన్నిసార్లు అనలేదూ ? పెట్టుబడిదారీలో ఎవరికీ స్వాతంత్ర్యం ఉండదని లక్షసార్లు అన్నారే. ఆడవాళ్ళ స్వాతంత్ర్యానికి పెట్టుబడిదారీ అడ్డంరాదా ? "

కొడవటిగంటి కుటుంబరావు